# ప్రజాశక్తి

సోమవారం 18 మార్చి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

# నేటి నుంచి 'పది' పరీక్షలు

- ఎన్‌టిఆర్ జిల్లాలో 33 వేలు, కృష్ణాలో 26,507 మంది విద్యార్థులు
- కేంద్రాల్లోకి మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం
- విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, ఎడ్యుకేషన్ (విజయవాడ)**

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. విద్యార్థులను పరీక్ష హాల్లోకి ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షలకు అనుమతించరు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. కృష్ణాజిల్లాలో ఏ కేటగిరీ 73, బి కేటగిరీ 25, సి కేటగిరీ 53 చొప్పున మొత్తం 151 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 26,507 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. రెగ్యులర్ విద్యార్థులు బాలురు 11,346, బాలికలు 10,112 మంది, ప్రయివేటు విద్యార్థులు బాలురు 3,109, బాలికలు 1,940 మంది పరీక్షలు రాయనున్నారు. 151 పరీక్ష కేంద్రాలకు ఛీప్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. పది మంది రూట్ ఆఫీసర్లను అదనంగా నియమించారు. సి పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు నిరంతరం పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు.

**ప్రశ్నాపత్రాలకు ప్రత్యేక నెంబర్లు**

గత సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు కృష్ణాజిల్లా డిఇఒ తహేరా సుల్తానా తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను పరీక్ష కేంద్రాలకు సమీపంలోని పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. ప్రశ్నాపత్రాలు లీకేజీకి తావు లేకుండా ప్రతి ప్రశ్నాపత్రానికి ప్రత్యేకంగా నెంబర్ కేటాయిస్తున్నారు. ఎక్కడైనా ప్రశ్నాపత్రం లీకేజీ అయితే ఏ కేంద్రం, ఏ విద్యార్థి నుంచి పేపర్ లీకైందో అధికారులు తేలిగ్గా గుర్తించగలరు. జవాబు పత్రాలను బుక్‌లెట్ రూపంలో అందించి వాటిపై (మిగతా 6లో)

విజయవాడ స్టెల్లా కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

## గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతం

కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి సంపత్‌కుమార్

పేపర్-1కు 63.06 , పేపర్-2కు 62.66 శాతం హాజరు

వార్త 6లో

# బిజెపి, దాని మద్దతుదారుల ఓటమే లక్ష్యం

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వరరావు

**ప్రజాశక్తి-గన్నవరం:** కేంద్రంలోని బిజెపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని, దానిని ఓడించడమే లక్ష్యంగా లౌకిక, ప్రజాస్వామ్యవాదులు కదలాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో గన్నవరంలో లౌకిక శక్తులు, కాంగ్రెస్, సిపిఐ బలపరిచిన సిపిఎం అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం నాయకులు టివిఎల్ లక్ష్మణస్వామి అధ్యక్షత వహించగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడంలో మోడీ ప్రత్యేక ప్రధానిగా గుర్తింపు పొందారని విమర్శించారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా యువకులను మోసం చేశారన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చారని, రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేయడంతో వెనక్కి తగ్గారని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 370 పార్లమెంటు స్థానాల్లో బిజెపి గెలుస్తుందని చెబుతున్నారని, అదే జరిగితే దేశం ప్రమాదంలో పడటం ఖాయమని స్పష్టం చేశారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించేందుకు మతం పేరుతో గొడవలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి ప్రయత్నిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి, (మిగతా 6లో)

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

# నేడు 'స్పందన' రద్దు

**ప్రజాశక్తి-విజయవాడ**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఈ నెల 18వ తేదీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లా కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, పి.రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. ఈ మేరకు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని, ప్రజలు దీనికి గమనించాలని కోరారు. అలాగే విఎంసి పరిధిలోనూ, సిపి కార్యాలయంలోనూ జరిగే స్పందన కార్యక్రమాలను రద్దు చేసినట్లు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా తెలిపారు.

# 'కోడ్'తో ముసుగు పడింది..!

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్‌టిఆర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన మరుక్షణం విజయవాడ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం, పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది నగరవ్యాప్తంగా రహదారుల్లో ఉన్న రాజకీయ నేతల ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలు తొలగించారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, బస్‌షెల్టర్లు, బస్టాండ్లు, బస్సులు, పార్కులు, డివైడర్లపై రాసిన రాతల తొలగింపు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. అలాగే ప్రధాన జంక్షన్లు, రహదారుల్లో ఉన్న బోర్డులు, ఫ్లెక్సీలు, అతికించిన గోడపత్రికలను తొలగించారు. ప్రధాన సెంటర్లలో ఉన్న రాజీవ్‌గాంధీ, వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు ముసుగు వేశారు. అవనిగడ్డలోనూ రాజకీయ పక్షాలకు సంబంధించిన భారీ హోర్డింగ్‌లను, ఫ్లెక్సీలను తొలగించారు.

# ప్రధాని మోడీకి స్వాగతం

**ప్రజాశక్తి-గన్నవరం**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి గన్నవరం విమానాశ్రయంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం ఢిల్ల నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి మోడీ చేరుకున్నారు. బిజెపి, టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు కాపు రామచంద్రారెడ్డి, పోతిన వెంకటమహేష్, బండ్రెడ్డి రామకృష్ణ, బండి రామకృష్ణ, చలమలశెట్టి రమేష్, కొనకళ్ల నారాయణ, బోండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకటరావు, కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎంఎస్ బేగ్ తదితరులు మోడీకి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో చిలకలూరిపేట బయల్దేరి వెళ్లారు.

# 'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాశక్తి - మైలవరం :** ఈ నెల 18 నుంచి జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలో మొత్తం తొమ్మిది సెంటర్లలో 1,378 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఇఒ బాలు ఆదివారం తెలిపారు. గవర్నమెంట్ హైస్కూల్ మైలవరం, శ్రీ చైతన్య, జెడ్పి బాయ్స్ హైస్కూల్, గౌతమ్, ఎస్ఎస్‌కె, వివేకానంద మైలవరం, జడ్.పి. హెచ్.ఎస్ సంద్రాల, జడ్‌పిహెచ్‌ఎస్ సిహెచ్‌బి గూడెం, జడ్‌పిహెచ్‌ఎస్ చంద్రగూడెం పాఠశాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఏర్పాటు 1,101 మంది రెగ్యులర్ విద్యార్థులు, 277 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరవు తున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. మంచినీళ్లు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న నల్లగట్ల, తదితరులు

## ఎస్‌సి కాలనీలో 'గుడ్ మార్నింగ్'

**ప్రజాశక్తి - విస్సన్నపేట :** స్థానిక ఎస్‌సి కాలనీలో గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తిరువూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామి దాసు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో భాగంగా గడపగడపకు తిరుగుతూ అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి, ఎంపిపి పిల్లిమిర్చి, పట్టణ అధ్యక్షులు నక్కల కుటుంబరావు, ఎంపిటిసి గద్దల మల్లయ్య మాజీ ఎంపిటిసి ఓలేటి దుర్గారావు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జనార్ధన్‌ను సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

## జనార్ధన్‌కు సన్మానం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ ఆదివారం జగ్గయ్యపేటకు వచ్చిన సందర్భంగా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత్రికేయుల పట్ల సరైన సహకారం అందించడం లేదని, ఇళ్ల స్థలాలను కూడా మంజూరు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సైదేశ్వరరావు, కట్టా గురవయ్య, సందల శ్రీనివాసరావు, కాకనబోయిన శివరామకృష్ణ, చింతా శ్రీనివాస్‌రావు, ఆరుద్ర నాగేశ్వరరావు, షేక్ నజీర్ మీరా, కె.ఆనంద్‌బాబు, యంద్రాతి బాబూరావు, ఎ.శేషు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సామినేని ఉదయభాను, తదితరులు

## వెంకటాచలంకు నివాళి

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని నకాశి బజార్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ ముత్యాల వెంకటాచలం కుటుంబాన్ని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటాచలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్‌గా వెంకటాచలం చేసిన సేవలను ఆయన కొనియాడారు.

# రోడ్డు ప్రమాదాలపై అవగాహన

**ప్రజాశక్తి - మైలవరం :** హెల్మెట్‌ను విధిగా ఉపయోగించి తమ విలువైన జీవితాలను కాపాడుకోవాలని మైలవరం సిఐ కిషోర్ బాబు, ఎల్‌బిఆర్ సిఇ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు అన్నారు. స్థానిక ఎల్‌బిఆర్ సిఇ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న స్పెషల్ క్యాంపులో భాగంగా రెండో రోజు ఆదివారం హెల్మెట్ వినియోగం రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశంపై కనిమెర్ల తండా గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్‌ను విధిగా ధరించి ప్రమాదాల నుండి రక్షణ పొందాలని తద్వారా తమ జీవితమే కాకుండా కుటుంబ సభ్యుల జీవితాలు కూడా ఆనందంగా ఉంటాయని అన్నారు. తల్లి జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శివ హరి ప్రసాద్, ఎస్.ఉమామహేశ్వర్ రెడ్డి వివిధ విభాగాల ఇన్చార్జులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మైలవరం మండలం కనిమేర్ల తండాలో రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కల్పిస్తున్న సిఐ తదితరులు

# కోడిపందేల శిబిరంపై దాడి

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు మండలం కాకర్లలో కోడిపందాల శిబిరంపై పోలీసులు ఆదివారం సాయంత్రం దాడిచేసి 12 మంది పందెం రాయుళ్లను వాహనాలతో సహా అదుపులోకి తీసుకున్నారు. మూడు కోళ్లను, కొంత నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. సంక్రాంత్రి పండగ అనంతరం నుండి కూడా మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కొంతమంది కాకర్ల గ్రామంలో జోరుగా ప్రతిరోజు కోడిపందాలు నిర్వహిస్తున్నారని పలువురు గ్రామస్తులు తెలిపారు. పోలీసుల అండదండలతో జరుగుతున్నాయని చెప్పారు. అయితే జూదగాళ్లతో కుమ్మక్కైన సిఐ, ఎస్ఐ లు బదిలీ అవ్వడంతో వారి స్థానంలో వచ్చిన ఎస్సై కోడి పందాల శిబిరాలపై దాడిచేసి అరెస్ట్ చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు శీలం పెద్ద పుల్లయ్య, శీలం చిన్న పుల్లయ్య, శీలం సాయి, శీలం ప్రవీణ్, శీలం రామారావు, వల్లాపురం సైదేశ్వరరావు అధికార వైసిపిని వీడి ఆదివారం బూదవాడ గ్రామ టిడిపి నాయకులు గడ్డం హుస్సేన్, 5వ వార్డు మెంబర్ వెంకయ్య ఆధ్వర్యంలో శ్రీరాం చిన్నబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి చిన్నబాబు, హుస్సేన్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాచబంటి సత్యషేఖర్, లక్ష్మణ, నాగరాజు పోతుమర్తి సాయి, పల్లపాటి నరేష్, సిహెచ్ సత్యనారాయణ, ఆనంగి సాయి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

# ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన కొందరు ఆటోలో విజయవాడ వెళుతుండగా మార్గమధ్యంలో మూలపాడు వద్ద ఆటో పల్టీ కొట్టి అందులో ప్రయాణిస్తున్న వారు తీవ్ర గాయాల పాలయ్యారు. అదే సమయంలో జగ్గయ్యపేట నుండి చిలకలూరిపేట మీటింగ్‌కి వెళ్తున్న టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ విషయాన్ని తెలుసుకుని హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని వారిని దగ్గరుండి వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదం జరిగిన ప్రాంతంలో శ్రీరాం తాతయ్య

## ఎపి ఆర్యవైశ్య కార్పొరేషన్ నూతన డైరెక్టర్‌కు సన్మానం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ నూతన డైరెక్టర్‌గా నూకల మల్లికార్జున రావు (రంగ)ని నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు, చారుగుండ్ల వెంకట లక్ష్మీనారాయణ (కొండ) ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్లు అందజేశారు. అనంతరం చారుగుండ్ల కొండ మాట్లాడుతూ సేవ్ అంటే నేనున్నా అనే వ్యక్తి నూకల రంగాని, పేద మహిళలకు ట్రస్టుల ద్వారా కుట్టు మిషన్లు, గ్రైండర్లు అందజేసేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్తక వాణిజ్య కమిటీ చైర్మన్ కొత్త పురుషోత్తం, ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య బిల్డింగ్ చైర్మన్ పేరూరు నరసింహారావు, పొట్టి శ్రీరాములు సేవా సమితి సెక్రటరీ కొత్త సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపికి బిసిల మద్దతు

**ప్రజాశక్తి - మైలవరం :** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గంలో వైసిపి బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నట్లు బిసి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈతాకుల జగదీష్, నియోజకవర్గ అధ్యక్షులు ఉయ్యూరు వెంకట్, జిల్లా కార్యదర్శి మట్టా రవి కుమారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అభివద్ధి సీఎం జగన్ తోనే సాధ్యమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బిసిలకు జగన్ గుర్తింపు నిస్తున్నారని, అందులో భాగంగానే మైలవరంలో వైఎస్ఆర్సిపి అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయానికి కృషి చేస్తామని అన్నారు.

## భాస్కరరావు కుటుంబానికి పరామర్శ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట:** పట్టణంలోని శాంతినగర్‌కి చెందిన టిడిపి నాయకుడు మాలెంపాటి సునీల్ కుమార్ తండ్రి మాలెంపాటి భాస్కరరావు కుటుంబాన్ని ఆదివారం వారి స్వగహంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురాం పరామర్శించారు. రఘురాం వెంట భాస్కరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గింజుపల్లి రమేష్, కళ్యాణం భాస్కరరావు, కళ్యాణం సూర్యప్రకాష్ రావు, మాలెంపాటి సురేష్, గద్దె నాని, చావా ఆదినారాయణ, గుత్తా నాగేశ్వరరావు ఉన్నారు.

# ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

• రూ.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం • తప్పిన ప్రాణ నష్టం

ఎగసిపడుతున్న మంటలు

**ప్రజాశక్తి-ఉయ్యూరు** : ఆకునూరు గ్రామ పంచాయతీ పరిధిలో విజయవాడ- మచిలీపట్నం జాతీయరహదారి పక్కన సర్వీసురోడ్డును ఆనుకుని ఉన్న కె శ్రీనివాస్‌కు చెందిన పాతప్లాస్టిక్ గోదాంలో ఆదివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్దమొత్తంలో పాత ప్లాస్టిక్ నిల్వ ఉంచిన గోదాములో ఒక్కసారిగా మంటలు లేచి పెద్దయెత్తున దట్టమైన పొగ అలముకుంది. కొద్దిసేపటిలోనే మంటలు గోదాములోను, ప్రాగణం, పక్కన ఉన్న సర్వీసు రోడ్డు వెంబడి పెద్ద గుట్టలుగా ఉన్న పాత ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు అంటుకుని ఉవ్వెత్తున మంటలు లేవడంతో పరిసర ప్రాంతంలో నివసించే వారు భయాందోళనకు గురయ్యారు. గోదాంలో బీహారు నుంచి వచ్చిన 30 మంది కార్మికులు, వారితోపాటు కొందరు స్థానిక మహిళలు పనిచేస్తూ ఉంటారు. ఆదివారం కావడంతో ఎవరు పనిలో లేక పోవడం, లోపల ఉన్న బీహారు కార్మికులు మంటలు చూసి బయటకు రావడంతో పెద్ద ప్రాణనష్టం సంభవించేది. ప్రమాదం సంభవించి నప్పుడు ఉయ్యూరు అగ్నిమాపక వాహనం గన్నవరంలో విమానాశ్రయం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ బందోబస్తులో ఉండగా పామర్రు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. దీంతో పెద్దమొత్తంలో పాత ప్లాస్టిక్, రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పూర్తిగా తగులబడిపోయింది. ప్రమాదంలో రూ.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా కాగా ప్రమాదానికి కారణం తెలియరాలేదు. ప్రమాద సంబవించినప్పుడు తరువాత గోదాము యజమాని అందుబాటులో లేదని తెలియవచ్చింది. నివాసాల మధ్య గోదాము తొలగించాలని ఆప్రాంతంలో నివసిస్తున్న వారు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న వారులేరని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. గోదాము ప్రహరీగోడ ఆనుకుని మూడు వైపులా పెద్దచెట్లు, మరోపక్క పెదఓగిరాలకు వెళ్లే సర్వీసు రోడ్డు ఉండటం వల్ల పక్కన ఉన్న ఇళ్లకు ప్రమాదం తప్పింది.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సిపి రెడ్డి

## సిఎఎపై అవగాహనా సదస్సు

**ప్రజాశక్తి - గుడివాడ** : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ పౌరసత్వ సవరణ బిల్లును ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి అన్నారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గుడివాడ సీఐటీయూ కార్యాలయం నందు ఆదివారం సిఎఎ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ సిఎఎ అమలు జరిగితే దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో వివరించారు. దేశాన్ని కాపాడాలంటే సిఏఏను అమలు కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి కిషోర్ కుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి లక్ష్మణ రావు, ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ జి 15 60 సిఐటియు అనుబంధం ఆటోనగర్ గుడివాడ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, నాయకులు అబ్దుల్‌కద్దూస్ పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**ప్రజాశక్తి-గుడివాడ** : ఏరా.. ఏం చేస్తున్నావ్.. ఎలా ఉన్నావ్...ఎక్కడ ఉంటున్నావ్... అని తోటి విద్యార్థులను మిత్రమా స్వాగతం అంటూ మిత్రమా స్వాగతం సంస్థ అధ్యక్షులు మల్లేల మల్లికార్జునరావు పలకరింపులతో అపూర్వ కలయిక ఆద్యాంతం ఉత్సాహంగా కొనసాగింది. 52 సంవత్సరాల క్రితం కళాశాలలో విద్యను అభ్యసించిన సహచరులు, విద్యా బోధన చేసిన గురువుల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అక్కినేని నాగేశ్వరరావు కళాశాల 1972-77 పూర్వవిద్యార్థుల కలయిక ఆదివారం స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట వెంకటశాస్త్రి బ్రాహ్మణ ధర్మసత్రం వేదికగా నిలిచింది. విద్యార్థులు ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆట పాటలతో అపూర్వ కలయికకు వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా మిత్రమా స్వాగతం సంస్థ అధ్యక్షులు మల్లేల మల్లికార్జునరావు, ముఖకార్యదర్శి కె.వివిఎస్ మూర్తి, తోట నరేంద్రదేవ్, వెన్నా వల్లభరావు, ఆకుల మల్లేశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇలా కలసుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు తమకు విద్యాబుద్దులు నేర్పి ఉన్నత శిఖరాలకు ఆధిరోహించేందుకు దోహదపడిన లెక్చర్లకు పాదాభివందనాలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. విద్యార్థులు తమ తోటి సహచరుల మంచి చెడులను అడిగి తెలుసుకున్నారు.

## ఆశ్రమ నిర్మాణానికి విరాళం

**ప్రజాశక్తి.చల్లపల్లి.** స్థానిక నిమ్మలతోటలోని సీయోను వద్ధాశ్రమ నిర్మాణానికి చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్ 50 వేల రూపాయలు విరాళంగా ఆదివారం నిర్వాహకులు శీలం భాస్కర్‌రావుకు అందచేశారు. ముమ్మనేని అనిల్ వంశీ, విశ్రాంత ఈఈఆర్డీ దాసి సీతారామరాజు, టీడీపీ నేత వేముల హరికృష్ణ, దళిత నేత బుల్లా కిషోర్‌లు పాల్గొన్నారు.

# గ్రామ సింహాలతో బెంబేలు

**ప్రజాశక్తి-గన్నవరం** : మండలంలోని వివిధ గ్రామ సింహాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మరో పక్క కోతులు స్వైర విహారం చేయడంలో జనాలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ సింహాల దాడుల్లో పలువురు గాయపయడ్డారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకు ఏ వీధిలో చూసినా కుక్కలు సంచరిస్తున్నాయి. రోడ్లపై వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి. మాంస దుకాణాల్లో వ్యర్థాలు తిని ఇష్టానుసారంగా హల్చల్ చేస్తున్నాయి.

**గాయపడుతున్న చిన్నారులు...**

మండలంలోని కేసరపల్లి, గన్నవరం, బుద్ధవరం, ముస్తాబాద, తెంపల్లి,వీఎస్పురం, చనుపల్లివారిగూడెం, చిక్కవరం, గొల్లనపల్లి, పట్నం, అల్లాపురం, దావాజిగూడెం గ్రామాల్లో కుక్కల సంఖ్య పెరిగింది. రోడ్లపై వెళ్తున్న జనాలపై దాడులు చేస్తున్నాయి. బుద్దవరం రోడ్డులో ఓ తెల్లకుక్క, మూడు నల్ల కుక్కలు రోడ్లపై వెళ్తున్న వారిపై చిన్నా పెద్దా లేకుండా దాడి చేస్తున్నాయి. వారం రోజుల్లో నలుగురు గాయపడ్డారు. గతంలో దీని దాడిలో గాయపడి పది మంది చిన్నారులు గాయపడినట్లు స్థానికులు చెబుతున్నారు. గౌడ పేటలో కుక్కల బెడద మరీ ఎక్కువగా ఉంటుంది.

**పెరుగుతున్న కుక్కల సంతతి**

గ్రామాల్లో కుక్కల సంతతి పెరిగిపోతుంది.

గన్నవరం, అల్లాపురం, దావాజిగూడెం ఏరియాల్లో మాంసం దుకాణాల వద్ద వ్యర్థాలు తినేందుకు అలవాటు

పడిన కుక్కలు పిల్లల సంఖ్యను పెంచుతున్నాయి. ఒక్కో కుక్క పది పిల్లలు పెట్టి రోడ్లపై వదిలేస్తుంది. దీంతో అవి పెరిగి జనాలపై దాడులకు తెగబడుతున్నాయి. ఒక్కో ఊరిలో 50 నుండి వంద వరకు కుక్కలు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కుక్కలని నియంత్రణకు పంచాయతీ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. కనీసం వాటిని పట్టించి ఎక్కడైనా అడవుల్లో వదిలివేయమని జనం అడుగుతున్నా మా వల్ల కాదని చెబుతున్నారు.కుక్కలకు ఆపరేషన్ చేయించే పని చేపట్టాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

**కుక్కకాటు వ్యాక్సిన్ కోసం ఇబ్బందులు..**

కుక్కకాటు వ్యాక్సిన్ అందుబాటులో లేక పోవడంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. కుక్క కరిస్తే ఇంజక్షన్ వేయించుకోవాలంటే రూ.5 వేల నుండి రూ.10 వేలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. గ్రామంలో ఏదోక చోట కుక్కల దాడిలో గాయపడిన వారు ఉన్నారు.

**కుక్కలను పట్టించుకోవడం లేదు.. శివాజీ, వి.ఎన్ పురం,**

వీధి కుక్కలతో చాలా ఇబ్బందికరంగా ఉంది. రోడ్డుమీద తిరగాలంటే భయం వేస్తుంది. బైక్ మీద వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. ఆసుపత్రికి వెళితే వేలాది రూపాయల ఖర్చు అవుతుంది. వాటిని పట్టించేదుకు అధికారులు ముందుకు రావడం లేదు. కనీసం మగ కుక్కలకు ఆపరేషన్ చేయించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

**కుక్కలతో బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి**

**అమీనా,గన్నవరం,**

కుక్కల దాడులు చాలామంది గాయపడుతున్నారు. పిల్లలు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కుక్కలను పట్టించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వీధి కుక్కలతో మరీ ప్రమాదంగా ఉంది. వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలి.

## వృద్ధాశ్రమంలో అగ్నిప్రమాదం

**ప్రజాశక్తి-చల్లపల్లి** : స్థానిక పార్వతమ్మతోటలోని ఆదరణ వృద్ధాశ్రమంలో ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ హఠాత్పరిణామానికి వద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న 23 మంది వద్దులు బిగ్గరగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. చుట్టూ ప్రక్కల ప్రాంతంలో యువకులు ఆశ్రయంలో చొరబడి మంచాలపై కదలలేని స్థితిలో ఉన్న వద్దులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో వద్దులకు ఎలాంటి గాయాలు కాలేదు. వద్దాశ్రమానికి వేసి సీలింగ్ కాలిపోగా వద్దుల దుస్తులు, వివిధ వస్తువులు బుగ్గిపాలయ్యాయి. ఆశ్రమం నిర్వాహకులు జంజనం రామ్మోహనరావు పరిసర ప్రాంతంలోని యువకులను, అవనిగడ్డలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారాన్ని అందించడంతో తుటిలో భారీ ప్రమాదం తప్పినట్లు అయ్యింది. ఉదయాన్నే కాలిపోయిన సామగ్రిని బయటపడాయించి, వద్దులకు దాతలు సమకూర్చిన ఆహారాన్ని అందించారు.

ఎంపికైన నూతన కార్యవర్గం

## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : పులిగడ్డ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కు చెందిన ది దివి ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కోఆపరేటివ్ ఎంప్లాయిస్ గ్రేట్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం సొసైటీ కార్యాలయం వద్ద నిర్వహించారు. నూతన అధ్యక్షుడుగా తోట జగన్మోహన్రావు, ఉపాధ్యక్షులుగా పొనుగుమాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మతి వెంకటేశ్వరరావు బాబు, డైరెక్టర్లుగా పెనుమూడి నాగేశ్వరరావు, వీరనాల నాగేశ్వరరావు, చావల వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు జగన్మోహన్రావు తెలిపారు.

## చిలకలూరిపేట సభకు తరలిన కార్యకర్తలు

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : చిలకలూరిపేటలో ఆదివారం టిడిపి జనసేన బిజెపిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభకు అవనిగడ్డ నుండి టిడిపి నేతలు భారీగా తరలి వెళ్లారు. వీరికి టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండ వీరికి టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ జండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

కార్యకర్తలకు జండా ఊపి ప్రారంభిస్తున్న మండ లి వెంకట్ రామ్

# రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** రాబోవు ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం కాని, చట్ట విరుద్ధమైన పనుల్లో పాలుపంచుకోవడం కానీ పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకునేది లేదని, ఎన్నికల ప్రక్రియను, ఓటింగ్ సరళిని ప్రభావితం చేసే ఏ అంశంలోనూ భాగస్వాములు కాకూడదని రౌడీ షీటర్లను డిసిపి హరికృష్ణ హెచ్చరించారు. ప్రతీ ఆదివారం నిర్వహించే సాధారణ కౌన్సెలింగ్‌లో భాగంగా డిసిపి హరికృష్ణ రౌడీషీటర్లతో పైన తెలిపిన హెచ్చరికలు చేస్తూ జీవితం చాలా విలువైనదని అనవసరంగా నేరాల్లో పాల్గొని జైలుపాలై తల్లిదండ్రులకు, భార్యా పిల్లలకు, బంధువులకు తలవంపులు తేవొద్దని, కుటుంబాలు చిన్నాభిన్నం చేసుకుని తమ, పిల్లల భవిష్యత్తును అస్తవ్యస్తం చేసుకోవద్దని హితవు పలికారు, సత్ప్రవర్తన కలిగిన వారిని, తప్పులు దిద్దుకొని సరైన దారిలో నడుస్తున్న వారిని గుర్తించి ఉన్నత అధికారుల అనుమతితో షీట్లను ఎత్తివేస్తామని ఆయన తెలిపారు. సదరు కౌన్సెలింగ్‌లో వెస్ట్ డివిజన్ ఎసిపి మురళీకృష్ణ రెడ్డి, వన్‌టౌన్ సిఐ దుర్గా శేఖర్ రెడ్డి, టు-టౌన్ సిఐ గణేష్, భవానీపురం సిఐ కృష్ణ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న డిసిపి హరికృష్ణ

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆసిఫ్, తదితరులు

## ఇఫ్తార్ విందు

**ప్రజాశక్తి, భవానీ పురం :** మనిషికి ఆకలి దప్పికలు తెలియజేయడం ద్వారా పరిపూర్ణుడుగా తీర్చిదిద్దేదే పవిత్రా రంజాన్ మాసం అని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. ఆదివారం కుమ్మరిపాలెం లోని తాజ్ మసీదు వద్ద స్థానిక కార్పొరేటర్ షేక్ రెహ్మతున్నీసా,షేక్ హయాత్ ఆధ్వర్యంలో జరిగిన రంజాన్ ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ గౌస్ మొహిద్దిన్‌తో పాటు కార్పొరేటర్లు ఎండి ఇర్ఫాన్, ఎమ్‌డి అర్షద్ మసీదు పెద్దలు షంషుద్దిన్, రవూఫ్, సర్దార్ జాని, ముజీబ్, బాజీ బాబా, జాహిద్, హమీద్, నయాం తదితరులు పాల్గొన్నారు.

## 40వ డివిజన్‌లో ఆసిఫ్ ప్రచారం

**ప్రజాశక్తి - భవానీపురం :** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వైఎస్ఆర్ కుటుంబ సభ్యులందరితో కలిసి ఆ పార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ పర్యటించారు. 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పశ్చిమ నియోజకవర్గం గడపగడపకు కార్యక్రమానికి విజయవాడ పశ్చిమ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ బ్యాంక్ సెంటర్ భవానీపురం, వైఎస్ఆర్ విగ్రహం ప్రాంతంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ నాయకులు, ప్రజలు నీరాజనాలు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి మరల గెలవాలని, శాసనసభ్యుడుగా ఆసిఫ్‌ని గెలిపిస్తామని చెప్పారు. పలువురు పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు, రాష్ట్ర ఛైర్మన్లు, రాష్ట్ర డైరెక్టర్లు, పలువురు నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.

## పారా మిలటరీ దళాల కవాతు

**ప్రజాశక్తి - భవానీపురం :** విజయవాడ నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రానా టాటా వారి ఆదేశాల ప్రకారం డిసిపి, వెస్ట్ ఎసిపి ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కలిగిన విధంగా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు గానూ ముందస్తు చర్యల్లో భాగంగా పారా మిలటరీ బలగాలు, సివిల్ పోలీస్ వారి కవాతు నిర్వహించారు. ఈ కవాతులో డిసిపి హరికృష్ణ, వెస్ట్ ఎసిపి మురళీకృష్ణారెడ్డి, వెస్ట్ డివిజన్ సిఐ కృష్ణ, ఎస్ఐలు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి - నందిగామ :** ద్విచక్ర వాహనంలో ఉన్న పెట్రోల్ ట్యాంక్‌లో ప్రత్యేక బాక్స్ అమర్చి అక్రమ మద్యంను నందిగామ పోలీసులు సీజ్ చేశారు. నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో తెలంగాణ అక్రమ మద్యం పోలీసులు పట్టుకున్నారు. రాజేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతను వద్దనుండి 150 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నందిగామ ఎసిపి రవికిరణ్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై వినూత్న పద్ధతిలో పెట్రోల్ ట్యాంక్‌లో ప్రత్యేక బాక్సును అమర్చిరవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు ఎసిపి తెలిపారు.

## విశ్వబ్రాహ్మణ పాలక మండలి ఏర్పాటు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** జగ్గయ్యపేట మండల, పట్టణ, నియోజకవర్గ పాలకమండలి ఆదివారం ఏర్పాటు చేశారు. శ్రీ భగవాన్ సత్యసాయి సమావేశ మందిరంలో ఎన్నికల సభ, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో జగ్గయ్యపేట మండల విశ్వబ్రాహ్మణ అధ్యక్షులుగా దేవులపల్లి లింగాచారి, ప్రధాన కార్యదర్శిగా సిద్ది విశ్వరూప చారి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో హాజరైన సభ్యులందరూ అత్యధికంగా 95శాతం మద్దతుతో వారిని ఎన్నుకున్నారు. జగ్గయ్యపేట పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కర్రి శ్రీధర్, పగోళ్ల పల్లి సత్యనారాయణ, మండల మహిళా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నలనాగుల అనురాధ, అడికొప్పుల వాణి రత్న కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట ప్రాంతీయ మండలాల నుండి నియోజకవర్గ అధ్యక్షునిగా మామిళ్ళపల్లి రామకష్ణని అందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి తాటికొండ రంగబాబు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు జవ్వాది కూర్మాచార్యులు, రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షులు తాళాబత్తుల వాసవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ధనమూరి వెంకట లక్ష్మీనరసింహచారి, ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు ధనాలకోట శోభన్ బాబు, ఎన్టీఆర్ జిల్లా అన్ని మండలంలో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జగ్గయ్యపేట మండల, పట్టణ విశ్వబ్రాహ్మణ మహిళలు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల నిరసనలో స్థానికులు, మహిళలు

## మహేష్‌కు పశ్చిమ జనసేన టికెట్ ఇవ్వాలని కొవ్వొత్తులతో నిరసన

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన మహేష్‌కు పశ్చిమ ఎంఎల్ఏ టికెట్ ఇవ్వాలని కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రెల్లి పేటలో రెల్లిస్ పెద్దలు, మహిళల ఆధ్వర్యంలో ఆదివారం ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 55 డివిజన్ అధ్యక్షులు సోమీ గోవింద్, వల్లంటి ఆది,గంగాధర్, భూపతి నంద, సంగం రెడ్డి రాజు, శిరంసెట్టి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# దుర్గంధంతో డ్రెయినేజీలు

### పట్టించుకోని అధికారులు
### ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ 17,18 వార్డులలో డ్రెనేజీలు అధ్వానంగా వున్నాయి. మురుగునీటి పారుదల లేక దుర్గంధ వాసన భరించలేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా 17వ వార్డు రెండో రోడ్డులో గల కాలవలో మురుగు పెరిగిపోయింది. కాలవలు పూడికతీత తీయక సంవత్సరాలవుతుంది. మురుగునీటి పారుదల లేకపోవడంతో దోమలు వ్యాపించి ప్రజలు అంటువ్యాధులు బారిన పడుతున్నారు. దోమల వల్ల జ్వరాలు వచ్చి చాలా ఇబ్బందులు పడుతున్నారు. డ్రెనేజీలు కూడిక తీయటానికి మున్సిపల్ అధికారులు ముందుకు రావడం లేదని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు డివిఆర్ కాలనీలో సచివాలయం వ్యవస్థ నడుస్తున్న పట్టించుకున్న దిక్కు లేదని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు సచివాలయం శానిటేషన్ కార్యదర్శి ఎక్కడ ఉన్నారని ప్రశ్నిస్తున్నారు. నందిగామలో శానిటరీ ఇన్స్పెక్టర్ లేక సుమారు సంవత్సరం దాటింది. అనుభవం లేని వ్యక్తులు శానిటరీ ఇన్స్పెక్టర్‌గా చలామణి అవుతూ మామూళ్ళు తీసుకుంటున్నారు తప్ప డ్రైనేజీలు పూడికలు తీయించడంలో పూర్తిగా విఫలమైనారని డివిఆర్ కాలనీ సిపిఎం నాయకులు జంగా దామోదర్ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి డివిఆర్ కాలనీలో శానిటేషన్ మెరుగుపరచాలని లేని పక్షంలో సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

## నిత్యావసర సరుకులు, ఆర్థికసాయం అందజేత

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** కంట్రిక్‌లో ఇటీవల ప్రమాదానికి గురైన అంగలకుదిటి వీర రాఘవా చారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, వైసిపి నాయకులు తోలేటి శ్రీకాంత్ పరామర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత కుటుంబానికి తోలేటి శ్రీకాంత్ నిత్యావసర సరుకులు, రూ.5 వేలు ఆర్థిక సహాయం విజయవాడ విశ్వబ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షులు చిట్టూరి హరీష్, సభ్యుల సహకారంతో అందించారు.

# ఎటు చూసినా చెత్తకుప్పలే

**ప్రజాశక్తి - వీరులపాడు :** మండల కేంద్రం గ్రామంలో చెత్త డంపింగ్ యార్డ్ లేకపోవడం వల్ల ఎక్కడ చెత్త అక్కడ పెద్ద ఎత్తున రోడ్లపై ఉండటంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. మండలంలో జుజ్జూరు మండల కేంద్రం 15 వేల జనాభా గల ఈ గ్రామం. జుజ్జూరు మండల కేంద్రం రోడ్లు ఇరువైపులా పెద్ద ఎత్తున పేరుకుపై చెత్త వల్ల దుర్వాసనతో ప్రజలకు అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ పాఠశాల కెళ్ళే రహదారి పక్కన, జుజ్జూరు రంగాపురం రోడ్డు విరువైపులా పెద్ద ఎత్తున చెత్త పేరుకు పోయింది. ఎల్లంకి, జుజ్జూర్ రోడ్డు గోకరాజు పల్లి జుజ్జూరు రోడ్డుపై చెత్త వేసి వివిధ గ్రామాల ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్నారు. చెత్త కుప్పల నుంచి వస్తున్న దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. మండల కేంద్రంలో సమస్యను పరిష్కారం కోసం అధికారులు ఇటువంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామానికి చెందిన ప్రజలు పంచాయతీ పాలకవర్గంపై మండిపడుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి చెత్త నుండి సేంద్రియ ఎరువులను తయారు చేయడానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టినా వాటిని వినియోగించుకోవడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజాధనం పెద్ద ఎత్తున దుర్వినియోగం పాలవుతుందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# దాహం కేకలు

- రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా
- ఒక్క నీళ్ల ట్యాంకర్‌తో అరకొరగా నీటి సరఫరా
- సమస్యపై పట్టించుకోని అధికారులు, నాయకులు

పెడనలో ట్యాంకర్ ద్వారా మంచినీటిని పట్టుకుంటున్న మహిళలు

**ప్రజాశక్తి-పెడన** : నాయకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యము తెలియదు కానీ పట్టణ, రూరల్ ప్రాంత ప్రజలకు శాపంగామారింది. ప్రచారంలో మాత్రం నాయ కులు నియోజకవర్గంలో వేసవిని దష్టిలో ఉంచుకుని ఎక్కడా కూడా దాహం కేకలు వినిపించ కూడదని ఆదేశాలు జారీ చేస్తున్న ఆచరణ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సందర్భంగా తయారయింది. మరోవైపు వేసవి కాలంతో రావడంతో కాంట్రాక్ట్ పద్ధతిలో వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయాల్సిన నాయకులు, అధికారులు వాటిని ఏర్పాటు చేయలేదు. వివరాల్లోకెళితే పురపాలక సంఘ పరిధిలో 32 కాలనీలోనూ అలాగే మండల పరిధిలోని 24 పంచాయతీలు వాటికి శివారు గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వీటిల్లో కొన్ని ప్రాంతాల్లో మంచినీటి కొళాయిలు ఉన్నప్పటికీ కూడా వాటిల్లోంచి అరకొరగానే వస్తున్నాయని ఆయాప్రాంత ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వం మున్సిపాలిటీ నుంచి కేవలం ఒకే ఒక్క మంచినీళ్ల ట్యాంకర్ ఉండటంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉన్న ఆ ఒక్క ట్యాంకర్ ఉండడంతో పట్టణ శివారు కాలనీలైన రాజనగర్ కాలనీ, బల్లిపురం కాలనీ తెలుగు పాలెం సింగరాయపాలెం లోని కాలనీలలోని ఈ ట్యాంకర్ 3 రోజులకు ఒకసారి మంచినీళ్ల సరఫరా చేస్తుంది. మిగిలిన ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికే పలు కార్యక్ర మాల్లో అధికారులకు, నాయకులకు తాగునీటి సమస్యపై వివరించిన పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**నెలరోజులు క్రితమే నిధులు విడుదల.**

రానున్న వేసవిని దష్టిలో ఉంచుకొని గత నెలలో జరిగిన మున్సిపల్ సర్వసభ సమావేశంలో పట్నం ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రైవేట్ ట్యాంకర్లను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీ నుంచి వీటి నిమిత్తం రెండు లక్షల రూపాయలు కూడా వెచ్చించారు. అయితే నేటికీ ఆచరణలో పెట్టకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి అర్థం పడుతుంది.

**ఇప్పటికే కోత విధిస్తున్న అధికారులు**

పలు వార్డుల్లో ఇంటింటికి తాగునీరు పైప్ లైన్ ఉన్నప్పటికీ వాటిల్లోనే సమయాన్ని కుదించేశారు. అసలే రోజు విడిచి రోజు తాగునీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు గంటల సమయం తాగునీటిని విడుదల చేసేవారు. అయితే ప్రస్తుతం గంటన్నర మాత్రమే తాగునీరు సరఫరా అవుతుందని పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారి స్పందించి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని పునరుద్ధించాలని పలువురు కోరుతున్నారు.

## నేటి నుంచి టెన్త్ పరీక్షలు

**ప్రజాశక్తి-ఘంటసాల** : నేటి నుంచి జరుగనున్న పదోతరగతి పరీక్షలకు ఘంటసాల మండలంలోని ఏడు జెడ్పి పాఠశాలల నుండి 232 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. పరీక్షలు నిర్వహణకు శ్రీకాకుళం, ఘంటసాల, కొడాలి జడ్పీ పాఠశాలలను కేంద్రాలుగా విద్యా శాఖ ఏర్పాటు చేసింది. ఘంటసాల జడ్పీ పాఠశాల నుంచి 71 మంది, కొడాలి జడ్పీ పాఠశాల నుంచి 22 మంది, గోగినేనిపాలెం జడ్పీ పాఠశాల నుంచి 42 మంది, శ్రీకాకుళం జడ్పీ పాఠశాల నుంచి 52 మంది, మల్లాయి చిట్టూరు జడ్పీ పాఠశాల నుంచి ఎనిమిది మంది, మల్లంపల్లి జడ్పీ పాఠశాల నుంచి 12 మంది, లంకపల్లి జడ్పీ పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓలు ఎన్.శివ శంకర్ రావు, ఎండి.మోమిన్ లు తెలిపారు. వీరిలో బాలురు 121 మంది బాలికలు 111 మంది ఉన్నారు. పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయగా విద్యార్థులకు హాల్ టికెట్లును ఆయా పాఠశాలల్లో ఇప్పటికే ఇచ్చేసినట్టు అధికారులు తెలిపారు.

**ప్రజాశక్తి-పెదపారుపూడి** : పదో తరగతి పరీక్షలు ఎటువంటి అవంతరాల్లేకుండా చూడాలని మండల విద్యాశాఖ అధికారి బి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వెంట్ర ప్రగడ పాఠశాలలో 51 మంది దోసపాడు, 45 మంది వానపాముల, 23 మంది పెదపారుపూడి, 43 మంది ఎలమర్రులో పరీక్ష రాయిస్తున్నారని ఆయన తెలిపారు .

## సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

**ప్రజాశక్తి-పమిడిముక్కల** : అమ్మఒడి, రైతు భరోసా, చేయూత తదితర పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి పేదలను ఆదుకుంటున్నారని రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంబపు రాంబాబు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఆదివారం ఆయన మంటాడ శివారు రెడ్డిపాలెం నుంచి స్థానిక వైసిపి నాయకులతో కలిసి శ్రీకాకుళం జిల్లాలోని ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సంక్షేమ పథకాలే జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తా యన్నారు. ఈ కార్యక్రమంలో కంబపు లక్ష్మయ్య, కంబపు రామ్ చరణ్, హేమలత, లక్ష్మి భవాని తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి కార్యాలయం వద్ద సంబరాలు

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబును తిరిగి అవనిగడ్డ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకొని టపాసులు పవిల్చి మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబుకు పలువురు నేతలు శుభాకాంక్షలు చెబుతూ స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి రమేష్ బాబు నియోజకవర్గంలో ప్రజల కు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. పొత్తులంటూ ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి నీచ రాజకీయాలు చేయటం సిగ్గుచేటు అన్నారు. ఆవనగడ్డ నియోజకవర్గ చరిత్రలో 2019 ఎన్నికలలో అత్యధిక భారీ మెజార్టీతో గెలుపొందిన రమేష్ బాబు తాను సాధించిన రికార్డును తిరిగి రాయడమే పార్టీ ద్వేయంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ విచ్చే శ్వరరావు, గ్రామ సర్పంచ్ గోరు ముచ్చు ఉమా, పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గాజుల జయ గోపాల్, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, యూత్ కన్వీనర్ చింతలపూడి బాల భాస్కరరావులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొని రమేష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

టపాసులు కాల్చుతున్న వైసిపి నాయకులు

విద్యార్థులు నూతన వస్త్రాలు అందజేసిన దృశ్యం

## భయం లేకుండా పరీక్షలు రాయండి

**ప్రజాశక్తి-గన్నవరం** : 10 వ తరగతి పరీక్షలే మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని, విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలని గన్నవరం జెడ్పిటిసి సభ్యురాలు ఎలిజాబెత్ రాణి విద్యార్థులకు సూచించారు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి జరగనున్న నేపథ్యంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇంగ్లీష్ మీడియం,ట్యాబ్, బుక్స్,బ్యాగ్, బుక్స్,సాక్షులు, బెల్ట్,రెండు జతలు స్కూల్ యూనిఫామ్, స్టడీ మెటీరియల్ అందించి తల్లిదండ్రులపై భారం తగ్గించారన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు తెచ్చుకోని స్కూల్‌కు, తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతులు తేవాలన్నారు.

## కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. జిల్లా నలుమూల నుండి సుమారు 20వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. దేవస్థానం చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, పాలక మండలి సభ్యులు, సిబ్బంది భక్తులకు ఏర్పాటు చేశారు.

## బాలుర వసతి గృహానికి రూ.50 వేలు వితరణ

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్** : మచిలీపట్నంలోని మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక నోబెల్ కాలనీలో ఉన్న కె ఎన్ హెచ్ బాయ్స్ హాస్టల్‌లో మౌలిక సదుపాయాల కోసం రూ.50 వేల రూపాయల వితరణను ఆదివారం అందజేసారు. మైత్రి ఫౌండేషన్ కార్యక్రమాలను సభ్యురాలు భవాని ద్వారా తెలుసుకొని కాకినాడ ప్రాంతానికి చెందిన ఒక దాత స్పందించి 50 వేల రూపాయలు వితరణ చేయగా వాటితో 43 మంది విద్యార్థులకు కొత్త బట్టలు, వసతి గృహంలో కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మచిలీపట్నం మెడికల్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశాలత మాట్లాడుతూ మైత్రీ ఫౌండేషన్ కార్యక్రమాలు చాలా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని అన్నారు. . రిటైర్డ్ డి ఈ ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయపాలన, ఏకాగ్రత, పట్టుదల, కషి మొదలైన 5 అంశాలను పాటిస్తే జీవితంలో విజయం సాధించవచ్చు అని హాస్టల్ బాలురకు దిశానిర్దేశం చేశారు..ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, నోబుల్ మిషనరీస్ కార్యదర్శి మణిలాల్, ట్రెజరర్ ప్రేమానందం,మైత్రి ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వరప్రసాద్, అధ్యక్షులు వేణు కుమార్, కార్యదర్శి రాధాకష్ణ,కోశాధికారి శ్రవణం శివ, సభ్యులు పాల్గొన్నారు.

# ‘అయోధ్య’ గన్నవరం పంచాయతీలో అంతర్భాగం

- ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్రం నాని

**ప్రజాశక్తి-గన్నవరం** : పది ఎకరాల విస్తీర్ణంలో 17 బ్లాక్‌ల్లో 670 అపార్ట్మెంట్ లతో నిర్మాణం జరిగిన అయోధ్య ప్రాజెక్టు గన్నవరం పంచాయతీలో అంతర్భాగమని, దానిలో కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం పంచాయతీకి ఉందని అయోధ్య ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్రం నాని తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల్లో నాలుగు బోర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా లక్షలాది లీటర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 250 లీటర్లు చొప్పున ఇస్తున్నామని, లోపల ఉన్న వారికి ఆర్.ఓ వాటర్ ను అందించడానికి ఒక పెద్ద ప్లాంట్ ను నిర్మాణం చేశామన్నారు. అయోధ్యలో ఉంటున్న వారికి ఆర్వో వాటర్ ను ఇవ్వగా మిగిలిన వాటర్ ను బయట గ్రామాల్లోని ప్రజలకు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. పంచాయితీ నుంచి అయోధ్యకు వాటర్ ఇవ్వడానికి అవసరమైన డిపాజిట్ సొమ్మును చెల్లించడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా ఇంటి పన్ను కూడా చెల్లించడానికి గహ యజమానులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఒక్క అయోధ్య నుంచి భారీ మొత్తంలో పంచాయితీకి ఆదాయం వస్తుందన్నారు. అందులో భాగంగానే మంచినీటి కోసం పైప్ లైన్ వేయడం జరిగిందన్నారు. ఇప్పటికే అయోధ్యలో నాలుగు బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నా, కొన్ని మౌలిక సదుపాయాలు పంచాయితీ నుంచి తీసుకోవాల్సిన అవసరం ఉందని, అందుకే శాఖా పరంగా ఆలోచించి పంచాయతీకి వాటర్ డిపాజిట్ చెల్లించామని చెప్పారు. అయోధ్య అనేది రాష్ట్ర చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని వివరించారు.

మాట్లాడుతున్న గుర్రం నాని

# గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతం

## పేపర్-1కు 63.06, పేపర్-2కు 62.66 శాతం హాజరు

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ :** ఎన్‌టిఆర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విజయవాడలో 24 కేంద్రాల్లో 10,526 మంది అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయగా ఉదయం జరిగిన పేపర్-1కు 6,638 మంది (63.06 శాతం), మధ్యాహ్నం జరిగిన పేపర్-2కు 6,596 మంది (62.66 శాతం) పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన కోఆర్డినేటింగ్, కస్టోడియన్, రూట్, లైజనింగ్ అధికారులు తదితరులకు కలెక్టర్ ఢిల్లీరావు అభినందనలు తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరగ్గా జిల్లా జాయింట్ కలెక్టర్, కోఆర్డినేటింగ్ అధికారి

డా. పి.సంపత్‌కుమార్ విజయవాడలోని వివిధ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. బిషప్ అజరయ్య జూనియర్ కాలేజీ, శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్దార్థ మహిళా కళాశాల పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.

రాజధాని గ్రామాల్లో పోలీసు కవాతు

**ప్రజాశక్తి - తుళ్లూరు**

ఎన్నికల నేపథ్యంలో రాజధాని గ్రామాల్లో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, వెంకటపాలెం గ్రామాల్లో పోలీసులు కవాతు జరిపారు. సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ (సిఎపిఎఫ్), స్థానిక పోలీసులు ఉదయం గం.9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ షేక్ సుభాని కోరారు.

## మొదటిపేజీ తరువాయి

### బిజెపి, దాని మద్దతుదారుల ఓటమే లక్ష్యం

జనసేన పార్టీలు బిజెపితో కలిసి ముందుకు వెళ్లేందుకు సిద్ధమవ్వగా వైసిపి రహస్య ఒప్పందంతో ముందుకు వెళుతున్నాయని విమర్శించారు. బిజెపికి మద్దతు తెలిపే పార్టీలను రాష్ట్రంలో చిత్తుగా ఓడించాలన్నారు. గన్నవరం నియోజకవర్గంలో సిపిఎంకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మూడు సార్లు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించి దేశంలోనే గన్నవరానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని వివరించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలబడేది ఎర్రజెండా మాత్రమేనని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని 84 పంచాయితీల్లో ప్రతి గ్రామంలో సిపిఎం అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఇంటికి కరపత్రం తీసుకువెళ్లి ప్రజలను చైతన్యపరచాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు, ఎం.హరిబాబు, కళ్లం వెంకటేశ్వరావు, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, నాయకులు అనుమోలు వెంకటేశ్వరావు, బి.శ్రీను, బుద్దవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, ఐద్వా నాయకురాలు జ్యోతి, ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు పాల్గొన్నారు.

### నేటి నుంచి 'పది' పరీక్షలు

సారి బార్‌కోడ్ వేస్తున్నారు. చీఫ్ సూపరింటెండెంట్ నుంచి వాటర్ బాయ్ వరకు తమ సెల్‌ఫోన్‌లను పరీక్ష కేంద్రాలకు బయట వదిలి రావాల్సి ఉంటుంది. సమాధానాలు రాసేందుకు తొలుత 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. ఈ బుక్‌లెట్ పూర్తయితే విద్యార్థికి మరో 12 పేజీల బుక్‌లెట్ ఇస్తారు.

ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 33,007 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 17,414 మంది, బాలికలకు 15,593 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు 178 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ప్రశ్నాపత్రానికి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. దీని వలన పారదర్శకంగా నిర్వహించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. పరీక్ష హాల్‌లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రికల్ గాడ్జెట్లకు అనుమతి లేదని ముందుగా విద్యార్థులు జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ మెడికల్ కిట్‌తో పాటు వేసవి సందర్భంగా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా చూడాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి పరీక్షా కేంద్రానికి సంబంధించి ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేయాలనుకుంటే హాల్‌టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించినట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 12 మంది రూట్ అధికారులను నియమించారు.

# తాటి ముంజలు.. ఆరోగ్యానికి ఎంతో మేలు..

**ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్సిటీ:** ప్రస్తుతం అన్ని రకాల ఆహార పదార్థాల ఉత్పత్తిలో మందుల పిచికారీ తప్పనిసరి. కూరగాయలు దగ్గర నుండి పండ్లు చివరకు కొబ్బరి బొండాలలో కూడా హైబ్రిడ్ రకాలు రావడం, చీడ పీడలు, తెగుళ్ళు సులువుగా ఆశించడంతో వాటి నివారణకు మందులు పిచికారి చేసి కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనూ సూక్ష్మ పోషకాల ఎరువులు లేని ఆహారం పదార్థం ఉందంటే కేవలం ఒక్క తాటి ముంజలుగా చెప్పుకోవచ్చు. వేసవిలోనే దొరికే తాటి ముంజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. విటమిన్- ఎ, బి, సి, ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం, కాల్షియం, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా దాగి ఉన్న తాటి ముంజలు తినడం ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తాటి ముంజల్లో ఉండే పొటాషియం రక్తపోటును అదుపు చేసి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరంలో ఉష్ణోగ్రత తగ్గించి జీర్ణక్రియ వ్యవస్థను మెరుగు పరుస్తుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. తాటి ముంజల్లో కొవ్వు పదార్థాలు తక్కువ ఉండడం వల్ల చిన్నపిల్లల్లో గుండె ఆరోగ్యానికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు జరుగుతుంది. వీటిల్లో నీటి శాతం ఎక్కువ ఉండటం వల్ల వేసవిలో వడదెబ్బ తగలకుండా చేయడం శరీరాన్ని చల్లబరచడంతో పాటు శరీరబరువు తగ్గించడం, చెడు కొలెస్ట్రాల్ తగ్గి, మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను తొలగించి లివర్ సంబంధిత సమస్యలను తాటి ముంజలు తగ్గిస్తాయి. ఆడవాళ్లలో బ్రెస్ట్ కేన్సర్ ముప్పు తగ్గించడం, కేన్సర్ కణాలను అడ్డుకోవడానికి ఉపయోగపడతాయి. గ్లూకోజ్ స్థాయిని పెంచి శరీరానికి కావాల్సిన మినరల్స్ క్రమబద్ధీకరణ చేయడంలో తాటి ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి. వేసవిలో ఎండ కారణంగా వచ్చే వికారం, వాంతులు, చికెన్ పాక్స్‌ను ముంజలు నివారిస్తాయి.. అని వైద్యులు సూచిస్తున్నారు.

# నియోజకవర్గాల్లో పోటాపోటీ

**ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి:** రానున్న ఎన్నికలకు ఎన్టీఆర్ జిల్లాలో వైసిపి అభ్యర్థులను పూర్తి స్థాయిలో ప్రకటించగా టిడిపి, జనసేన కూటమి కొంత మందినే ప్రకటించింది. విజయవాడ పశ్చిమానికి షేక్ ఆసిఫ్, విజయవాడ సెంట్రల్‌కు వెల్లంపల్లి శ్రీనివాస్, విజయవాడ తూర్పు దేవినేని అవినాష్, మైలవరంకు సర్నాల తిరుపతిరావు యాదవ్, జగ్గయ్యపేట సామినేని ఉదయభాను, తిరువూరు నల్లగట్ల స్వామిదాస్, నందిగామ మొండితోక జగన్‌మోహన్‌రావులను వైసిపి అధిష్టానం అభ్యర్థులుగా ప్రకటించింది. విజయవాడ తూర్పులో టిడిపి అభ్యర్థి గద్దె రామ్మోహన్‌రావుతో దేవినేని అవినాష్ తలపడనున్నారు. గద్దె రామ్మోహన్ ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే. ఈ స్థానం నుంచి ఒక సారి ఓడిపోయిన గద్దె రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో పిఆర్‌పి నుంచి యలమంచిలి రవి, కాంగ్రెస్ నుంచి దేవినేని నెహ్రూ, టిడిపి నుంచి గద్దె రామ్మోహన్ పోటీ పడ్డారు. ముగ్గురు అభ్యర్థుల మధ్య హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో యలమంచిలి రవి గెలుపొందగా, నెహ్రూ, గద్దె ఓడిపోయారు. విజయవాడ సెంట్రల్‌లో వెల్లంపల్లి శ్రీనివాస్, బొండా ఉమాలు తలపడనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఒక సారి టిడిపి, ఒక సారి కాంగ్రెస్, ఒక సారి వైసిపి గెలుపొందాయి. 2014లో బొండా ఉమా గెలవగా 2019లో మల్లాది విష్ణు విజయం సాధించారు. 2009లో మల్లాది విష్ణునే కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. సిపిఎంకు కూడా ఇక్కడ మంచి పట్టు ఉంది. 2019లో ఆ పార్టీ నుంచి చిగురుపాటి బాబూరావు పోటీ చేశారు. దాదాపు 30 వేల పైచిలుకు ఓట్లు లభించాయి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో పాత ప్రత్యర్థులే తలపడనున్నారు. వైసిపి నుంచి సామినేని ఉదయభాను, టిడిపి నుంచి శ్రీరామ్ తాతయ్య బరిలోకి దిగనున్నారు. శ్రీరామ్ తాతయ్య 2009, 2014లో రెండు పర్యాయాలు గెలుపొందగా సామినేని ఉదయభాను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తిరువూరులో టిడిపి నుంచి కొలికపూడి శ్రీనివాసులు కొత్త అభ్యర్థిగా రంగంలోకి దిగనున్నారు. వైసిపి నుంచి నల్లగట్ల స్వామిదాస్ పోటీ చేయనున్నారు. స్వామిదాస్ ఇది వరకు రెండు సార్లు టిడిపి నుంచి గెలుపొందారు. ఇటీవల ఆయన వైసిపిలో చేరడం, తిరువూరు అభ్యర్థిగా ఖరారు చేయడం జరిగింది. ఇప్పటి వరకు రెండు సార్లు వైసిపి గెలవగా, నాలుగు పర్యాయాలు టిడిపి గెలిచింది. నందిగామ నియోజక వర్గంలో పాత ప్రత్యర్థులే ఈ సారి కూడా బరిలో నిలవనున్నారు. టిడిపి నుంచి తంగిరాల సౌమ్య, వైసిపి నుంచి మొండితోక జగన్‌మోహన్‌రావు పోటీ చేయనున్నారు. 2019లో మొండితోక జగన్‌మోహన్‌రావు గెలుపొందగా 2014లో తంగిరాల సౌమ్య విజయం సాధించింది. మైలవరం, విజయవాడ పశ్చిమ స్థానాల అభ్యర్థులను వైసిపి ఇది వరకే ప్రకటించగా, టిడిపి ఖరారు చేయాల్సి ఉంది.

# ఎన్నికల ప్రచారానికి పదును

**ప్రజాశక్తి-విజయవాడ:** రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారానికి పదును పెడుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు మే 13న, కౌంటింగ్ జూన్ 4న జరుగుతాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజకీయపార్టీలు తమ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఆయా రాజకీయ పార్టీల తరుపున అభ్యర్థులు ఎవరనేది కూడా స్పష్టం కావడంతో, నియోజకవర్గం స్థాయిలో పార్టీలు వివిధ రూపాల్లో ఓటర్ల వద్దకు ప్రచారాన్ని తీసుకెళ్లేందుకు కసరత్తు చేస్తున్నాయి. అడపాదడపా ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించిన రాజకీయపక్షాలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వ్యూహరచన చేసే పనిలో ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సరికొత్తగా ఈ సారి ఎన్నికలు జరగబోతున్నాయి. ఆయా పార్టీల మధ్య పొత్తులు కూడా ఖరారయ్యాయి. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ప్రధానంగా సిపిఎం, వైసిపి, టిడిపి పోటీలో ఉన్నాయి. ఈ సారి టిడిపికి ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలైన బిజెపి, జనసేన పార్టీలు మద్దతునిస్తున్నాయి. ఈ మూడు పార్టీలు కలిసి ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. దీనిలో భాగంగానే దేశ ప్రధాని నరేంద్ర మోడీ, అలాగే టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ సిఎం నారాచంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఉమ్మడిగా కలిసి గుంటూరు జిల్లా చిలకలూరిపేట శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచార సభలో వారు పాల్గొని ప్రసంగించారు. అయితే ఈ సభకు విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల నుంచి కూడా టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు కదిలివెళ్లాయి. దీంతో ఆ పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించినట్లైంది. అయితే ఈసారి కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమిని ఎదుర్కొనే దిశగా ఇండియా కూటమి ఏర్పడటం, దీనిలో భాగంగానే కమ్యూనిస్టులు, కాంగ్రెస్, ఇతర లౌకిక పార్టీలు ఉమ్మడిగా కలిసి పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెంట్రల్ నియోజకవర్గంలో పోటీలో ఉన్న సిపిఎంకు సిపిఐ, కాంగ్రెస్, ఆప్ పార్టీలు, లౌకిక, ప్రజాస్వామిక వాదులు మద్దతునివ్వాలని ఇప్పటికే ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు ఆయా పార్టీల నేతలు వివరిస్తున్నారు. సిపిఎం తన పోరాటంలో భాగంగా ఎన్నికలను కూడా ఒక ఆయుధంగా చేసుకొని ఎన్నికల క్షేత్రంలో దిగి, ఎక్కడికక్కడ సమస్యలను అధ్యయనం చేస్తూ, డివిజన్ల వారీగా ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ, ఆయా ప్రధాన జఠిలమైన సమస్యలపై నిరసనలు, ధర్నాలు చేస్తూ తనదైన శైలిలో గత నెల రోజుల నుంచి పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు నేతృత్వంలో ఆ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఓటర్ల వద్దకు ప్రచారాన్ని తీసుకెళ్లే పనిలో నిమగ్నమయ్యారు. అధికార వైసిపి కూడా ఆ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేస్తుంది. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌ను ఈ సారి సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించిన ఆ పార్టీ ఆతనినే పార్టీ అభ్యర్థిగా కూడా ప్రకటించింది. ఈ క్రమంలో సిపిఎం, వైసిపి, టిడిపిలు ప్రచారానికి పదును పెట్టే పనిలో ఉన్నాయి.

# మైనార్టీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ నియోజకవర్గంలో వెనుకబడిన వర్గాల నుండి బలమైన రాజకీయ నేతను అసెంబ్లీ బరిలో నిలుపుతామని వెనుకబడిన వర్గాల రాజకీయ ఐక్య కార్యాచరణ పిలుపునిచ్చింది. ఆదివారం అవనిగడ్డలోని ఏ 1 మార్ట్ సమావేశం వాలులో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ముఖ్య నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రైల్వే కాంట్రాక్టర్ పీఎస్ఆర్ గ్రూప్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ అత్యధిక ఓట్లు కలిగిన సామాజిక వర్గాలను విస్మరించడం తగదన్నారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవ గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన సమా వేశంలో పలు సంఘాల నేతలు రాజకీయాల వైపు ప్రయాణం చేయాలని తీర్మానం చేశారు. నియోజక వర్గంలో దశాబ్దాల కాలంగా ఒకే సామాజిక వర్గం రాజకీయ బరిలో నిలవడం ఇతర వెనుకబడిన వర్గాలను అన్ని రాజకీయ పార్టీలు విస్మరించడం వారి వెనుకబాటుతనానికి కారణమని తెలిపారు. సామాజిక సేవలో ప్రజా ఉద్యమాలలో ముందుండే వ్యక్తులను నిజాయితీపరులను తమ అభ్యర్థిగా ఎన్నుకోడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. అవనిగడ్డ నియోజకవర్గం లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలపై ఒక సామాజిక వర్గం ఏళ్ల తరబడి అనుభవిస్తున్న రాజ్యాధికారాన్ని బీసీలకు అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హిస్టరీ సంఘ కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది సైకం రాజశేఖర్, ఏపీ బీసీ చైతన్య వేదిక అధ్యక్షులు ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కోటా కరుణ్ కుమార్, ఏ శ్రీనివాసరావు, ఎస్టీ సంఘం నేత బోడ వెంకన్న, వడ్డెర సంఘం నాయకులు వి వెంకటేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎల్ ఆచారి బొల్లా పణి బాబు, మైనార్టీ సంఘం నాయకులు ఎన్ ఖాదర్‌వలీ, అవనిగడ్డ మాజీ ఎంపీపీ లుక్క పిచ్చయ్య, ది డ్ల ప్రసాద్ కొండవీటి సురేష్ లతోపాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొడాలి నానిని సత్కరిస్తున్న దళిత నాయకులు

## చంద్రపాల్‌కు అభినందనలు

**ప్రజాశక్తి-గుడివాడ** : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శిగా మెండా చంద్రపాల్‌కుమార్‌ను నియమించేందుకు కృషి చేసిన మాజీ మంత్రి, తాజా మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)కు దళిత నాయకులు ప్రతేక ధాన్యవాదాలు తెలిపారు. ఆదివారం అయన స్వగృహంలో వైసిపి ఎస్సీసెల్ నాయకులు మెండా కిరణ్‌కుమార్, కారే జోషప్, కాకోల్లు రాజారెడ్డి, బేజం సువర్ణరాజులు మాట్లాడుతూ మెండా చంద్రపాల్‌కు రాష్ట్రస్థాయి ఎస్సీసెల్‌లో స్థానం కల్పించిన నానికి దళితులు రుణపడి ఉంటారన్నారు.

## ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : దేశ పార్లమెంటుకు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికల తేదీని శనివారం సాయంత్రం మూడు గంటలకు ప్రకటించడంతో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్నికల కోడ్ కు సంబంధించిన చర్యలు మొదలుపెట్టారు. అవనిగడ్డలో ఇబ్బిడి ము బ్బి డి గా అధికార ప్రతిపక్ష పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే పనులను ప్రారంభించారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. గ్రామ కార్యదర్శి తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. దీనితో ఎలక్షన్ అధికారులు చర్యలు వేగవంతం చేసినట్లు అయింది.

# పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం

మోపిదేవిలో...

**ప్రజాశక్తి-మోపిదేవి** : వేసవికాలంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతో మేలు చేస్తుందని పలువురు కొనియాడారు. టిఎస్ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని మోపిదేవి ప్రధాన సెంటర్లో ఆదివారం ఏర్పాటుచేసిన చలివేంద్ర కేంద్రాన్ని తిరుపతి శ్రీనివాసరావు కుమారులు, తికమకతాండా సినిమాలో నటించిన యువ హీరోలు రామ్, హరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు చలివేంద్ర కేంద్రాల్లో వచ్చే ప్రజల సౌకర్యార్థం చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. యువ హీరోలు రామ్ హరీలు మాట్లాడుతూ టి ఎస్ ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో కూడా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కష్ణా జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షులు బోళ్ళ పని బాబు, తో పాటు బీసీ సంఘం నేతలు, టిఎస్ఆర్ గ్రూప్ సభ్యులు, టిఎస్ఆర్ యూత్ సభ్యులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘంటసాలలో..

**ప్రజాశక్తి-ఘంటసాల** : వేసవికాలంలో బాటసారులు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు యువ హీరోలు తిరుపతి రామ్, తిరుపతి హరిలు తెలిపారు. టిఎస్ఆర్ గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం ఘంటసాల మండల పరిధిలోని కొడాలి గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని యువ హీరోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా టిఎస్ఆర్ గ్రూపు ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, గ్రామస్థులు టిఎస్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## అరుదైన ప్రాకత శాసనం లభ్యం

**ప్రజాశక్తి చల్లపల్లి** : పురావస్తు శాస్త్రవేత్తల పుణ్యమా అని ఇప్పటికీ అరుదైన, గొప్ప గొప్ప శాసనాలు, అరుదైన శిల్పాలు బయల్పడుతూనే ఉన్నాయి. ఇటీవల చల్లపల్లి మండలం పురిటి గడ్డలో ఒక అరుదైన ప్రాకత శాసనం ఒకటి లభించింది. అది ఇక్ష్వాకుల కాలం నాటిది అని పురావస్తు శాస్త్రవేత్తలు అంటున్నారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డలో పురాతన విగ్రహాన్ని గుర్తించారు. గ్రామంలోని పోతురాజు స్వామి ఆలయం పునర్ నిర్మాణం చేపట్టిన గ్రామ పెద్దలు పాత ఆలయాన్ని తొలగించే క్రమంలో ఆలయంలోని ఏడు అడుగుల పొడవైన విగ్రహాన్ని పీఠం నుంచి బయటకు తీశారు. విగ్రహం శుభ్రంగా కడిగి అధివాసంలో ఉంచారు. పురిటిగడ్డ కష్ణసాయి మందిర నిర్మాత, మేనేజింగ్ ట్రస్టీ, గ్రామ ప్రముఖులు, పోతురాజు స్వామి దేవాలయ పునర్ నిర్మాణ కమిటీ పెద్దలు నాదెళ్ల శివరామకష్ణ, పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్ ప్లస్ అధ్యాపకురాలు ఓలేటి ఉమా సరస్వతి ఈ విగ్రహాన్ని పరిశీలిస్తే విగ్రహానికి ఒక పక్కన ప్రాచీన లిపి కనిపించింది. దీంతో వెంటనే ఈ విగ్రహం ఫోటోలను పురావస్తు శాఖ నిపుణులు ఈమని శివ నాగిరెడ్డికి పరిశీలన కోసం పంపించారు. విగ్రహం రూపురేఖలు, విగ్రహంపై ఉన్న ప్రాచీన లిపి గమనించిన శివ నాగిరెడ్డి మూడవ శతాబ్దం నాటి విగ్రహం అయి ఉండవచ్చని, త్వరలో పురావస్తు అధికారులతో కలిసి పురిటిగడ్డ వచ్చి విగ్రహం పరిశీలిస్తామని తెలిపారని నాదెళ్ల శివరామకష్ణ తెలిపారు. కాగా విగ్రహాన్ని దాని వెనుక ఉన్న శాసనాన్ని పరిశీలించిన కేంద్ర పురా వస్తు శాఖ విభాగం సంచాలకులు కె.మునిరత్నంరెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ శాసనం చాలా పురాతనమైనదిగా ప్రక టించారు. ఆ విగ్రహం ఇక్ష్వాకుల కాలం నాటిదని స్పష్టం చేశారు.

## అన్నసమారాధన

**ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : మండలంలోని రొయ్యూరు గ్రామంలో సకలేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అన్న సమారాధన జరిగింది. రొయ్యూరు లో సకలేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ట, నూతన దేవతా విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. వేలమంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు దేవతామూర్తులకు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మోర్ల రామచంద్రరావు, లుక్కా పరశురామయ్య, లుక్కా లక్ష్మణరావు, లంక వెంకట శ్రీనివాసరావు, వర్రీ మురళీకష్ణ,ముద్రపు నాగరాజు, లుక్కా వెంకటేశ్వరరావుల పర్యవేక్షణలో ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

# ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు సిపిఎం, సిఐటియు మద్దతు

**ప్రజాశక్తి-తాడేపల్లి** : ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు సిపిఎం, సిఐటియు తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిపిఎం నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సిఐటియు తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు తెలిపారు. ఆదివారం సిమెంటు ఫ్యాక్టరీ యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన కార్మిక కుటుంబాలు జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా ఉండి పోరాడితేనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంటి ముందుకు వచ్చే వారిని నిలదీయాలని సూచింకారు. కోర్టు తీర్పు ఇచ్చినా తమ సమస్య పరిష్కారం కాలేదని, కార్మికుల సమస్య పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామని ఆయా రాజకీయ పార్టీల నాయకులకు స్పష్టం చేయాలన్నారు. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారానికి నోచుకోకపో వడంతో కార్మికులందరూ చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యారని యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ తెలిపారు. కార్మికులకు రావాల్సిన బాకాయిలు చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కార్మికులకు మద్దతు తెలుపుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు

# సిపిఎంకు మద్దతివ్వాలని ప్రచారం

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

బాబూరావుకు స్వాగతం పలుకుతున్న మహిళ

**ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ :** 60వ డివిజన్ వాంబే కాలనీ 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో మార్పు కోసం పాదయాత్ర ఇంటింటికీ కరపత్రాలు ఆదివారం పంచారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ విజయవాడ నగరం అభివృద్ధి చెందాలంటే రెండో ఫ్లైఓవర్ నిర్మించాలంటే సిపిఎంకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. వాంబే కాలనీలో ఇంటి స్థలాలు ఇంటిపట్టాలు రిజిస్ట్రేషన్ చేయించాలన్న చెత్త పనులు రద్దు చేయాలన్నా సిపిఎంను గెలిపించాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం అవ్వాలంటే కమ్యూనిస్టులకు మద్దతు తెలపాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని, బిజెపి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్న టిడిపి, జనసేనలను ఓడించాలని చెప్పారు. కార్మిక సమస్యలు పరిష్కరిం చాలంటే సిపిఎంను బలపరచాలని పాయకాపురం రాజీవ్‌నగర్ శాంతినగర్‌లో మంచినీటి సమస్య తీరాలంటే సిపిఎంకు డిస్నీలాండ్‌లో 57 ఎకరాల భూమిని ఇంటి స్థలాల కోసం కేటాయించాలని అవి అమలు చేయడం సిపిఎం ద్వారా అవుతుందన్నారు.

ప్రజల కోసం నిలబడే ఏకైక పార్టీ సిపిఎం అని దానికి మద్దతు తెలిపాలని కార్మికుల సమస్యల కోసం పోరాడే సిపిఎంకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, అధ్యక్షులు కె.దుర్గారావు సిపిఎం నాయకులు, ఎస్‌కె పేరు రాంబాబు నాగేశ్వరరావు రాంబాబు, సాంబిరెడ్డి 57 డివిజన్ టి.శ్రీను, ఎంవి.రమణ, టి.సాయి, రాజులమ్మ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో మహిళలతో మాట్లాడుతున్న బాబూరావు

## మార్కెట్లోకి యార్డ్లీ నూతన ఉత్పత్తులు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** వ్యక్తిగత వాష్ బ్రాండ్‌లలో అగ్రస్థానంలో ఉన్న విప్రో యార్డ్లీ సరికొత్తగా జెల్‌బార్, షవర్ జెల్ కలెక్షన్స్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో నూతన ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షవర్ ఎసెన్షియల్ ఉత్పత్తులలో సరికొత్తగా షవర్ జెల్, క్లియర్‌జెల్‌ను పరిచయం చేసినట్లు తెలిపారు. సహజమైన పూల తైలాలతోతయారు చేసిన ఈఉత్పత్తులశ్రేణి రిఫ్రెష్, సువాసన, విలాసవంతమైన స్పాలాంటి అనుభూతిని ఇస్తుందని తెలిపారు. ఈ ఉత్పత్తులు అన్ని రకాలైన చర్మాలకు అనుకూలంగా ఉంటాయన్నారు. క్లియర్ జెల్ బార్‌లు 99 శాతం స్వచ్ఛమైన గ్లిజరిన్‌ను కలిగిఉంటాయని తెలిపారు. అన్ని షాపింగ్ మాల్స్‌లోనూ లభ్యమవుతుందని తెలిపారు.

## శామ్‌సంగ్ హోలీ సేల్

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** అతి పెద్ద పండుగ హోలీ పురస్కరించుకుని శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రత్యేక ఆఫర్లను అందిస్తుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శాంసంగ్ రీజనల్ హెడ్ కె.సుబ్బారావు తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శాంసంగ్ షోరూమ్ నందు పండుగ ఆఫర్ల గురించి తెలిపారు. శాంసంగ్‌కు సంబంధించి ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లు, వేరబుల్స్, సామ్‌సంగ్ టీవీలు, ఇతర డిజిటల్ ఉపకరణాలపై ప్రత్యేక ఆఫర్లు అందించనున్నారని తెలిపారు. ఆఫర్లతో పాటు క్యాష్‌బ్యాక్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారని తెలిపారు. శాంసంగ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్లలో ఆఫర్లు ఉంటాయన్నారు.అలాగే డెబిట్, క్రెడిట్ కార్డులపై వినియోగదారులు గరిష్టంగా 22.5 శాతం క్యాష్ బ్యాక్ పొందే అవకాశం ఉందని తెలిపారు.

## 19 నుండి ఇసుజు ఫ్రీ సమ్మర్ క్యాంప్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఈ నెల 19 నుండి ఇసుజు మోటార్స్ ఆధ్వర్యంలో ఐ - కేర్ ఫ్రీ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి ఎం.ఎస్.రాజు తెలిపారు. నగరంలోని ఇసుజు మోటార్స్ డీలర్స్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. మోటార్స్ రంగంలో అగ్రభాగాన ఉన్న ఇసుజు మోటార్స్ ప్రతి ఏటా ఫ్రీ క్యాంప్‌ను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇసుజు మోటార్స్‌కు సంబంధవించి డి.మ్యాక్స్ పిక్ అప్స్. ఎస్‌యూవీ కార్లశ్రేణిలో సర్వీస్‌ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వినియోగదారులకు సంబంధించి సమస్యారహిత డ్రైవింగ్ అనుభవం కొరకు వివిధ రకాలైన పరీక్షలను డ్రైవింగ్‌లో ఈ క్యాంప్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ఈనెల 19 నుండి 24వ తేదీ వరకు అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్‌లెట్లలో ఫ్రీ సమ్మర్ క్యాంపు జరుగుతుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వినియోగదారుల కోసం తమ వాహనాలపై ప్రత్యేక ఆఫర్లు, ప్రయోజనాలు కూడా అందుకోవచ్చని తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న ఎంఎల్‌సి అరుణ్ కుమార్

## నరేంద్రకు ఎంఎల్‌సి శుభాకాంక్షలు

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ 14 వ వార్డు ఇంచార్జ్ నాదెండ్ల నరేంద్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. నరేంద్ర జన్మదిన సందర్భంగా ప్రత్యేకంగా కేక్ కట్ చేయించారు. శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరుణ్ కార్డియాక్ సైన్సెస్ వార్షికోత్సవం సందర్భంగా

## రూ.5 వేలకే గుండె వైద్య పరీక్షలు

డాక్టర్ వరుణ్

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ (విసిఎస్) ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా రూ.5 వేలకు యాంజియోగ్రామ్‌తో కూడిన వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ వరుణ్ గుంటూరు తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద గల హాస్పటల్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆదివారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వయసుతో నిమిత్తం లేకుండా, ఎటువంటి లక్షణాలు లేకుండా గుండె సమస్యలతో కుప్పకూలుతున్నారన్నారు. అటువంటి సంఘటనల నుండి ముందుగానే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వల్ల వైద్యం సకాంలో అందించి ప్రమాదం లేకుండా చేయవచ్చని తెలిపారు. అందుకే తమ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా బెంజిసర్కిల్ వద్ద గల తమ హాస్పటల్‌లో రూ.5 వేలకు యాంజియోగ్రామ్‌తో కూడిన గుండె వైద్య పరీక్షలను నిర్వహించనున్నామని తెలిపారు. వివరాలకు 94922 71879 లేదా 0866 - 2431879 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

## 'అధికార కాంక్షతోనే రాజకీయ పక్షాలు'

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ :** రానున్న ఎన్నికల్లో ప్రజా సమస్యలే ప్రధాన ఎన్నికల ఎజెండాగా చేసేందుకు కృషి చేస్తుందని ఫోరం రాష్ట్ర కన్వీనర్ ముహమ్మద్ జాహిద్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వచ్చే ఎన్నికలకు సంబంధించిన ప్రజా మేనిఫెస్టోను కోకన్వీనర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కోకన్వీనర్, హైకోర్ట్ అడ్వకేట్ పిచ్చుక శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రస్తుత ధోరణులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ప్రజాసమస్యలు పట్టకుండా అధికార కాంక్షతోనే రాజకీయ పక్షాలు పనిచేస్తున్నాయన్నారు. జాతీయ పార్టీలు ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసి విభజించాయని, ఈ పదేళ్లలో ఒక్క విభజన హామీ కూడా అమలు కాకపోవడం శోచనీయమన్నారు. గత దశాబ్దకాలంగా అనుసరించిన విధానాల వల్ల దేశం అస్తవ్యస్తమైందని, అన్ని రంగాల్లో కార్పొరేటీకరణ జరిగిందని, దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపించిందని మండిపడ్డారు. ఈ తరుణంలో రాష్ట్రంలోని ఒక పార్టీ ప్రత్యక్షంగానూ, మరొకటి పరోక్షంగానూ కేంద్రంలోని భాజపాకు మద్దతు తెలపడం హాస్యాస్పదమని అన్నారు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ఫోరం తరపున మేనిఫెస్టో రూపొందించామని రాజకీయ పార్టీలు దీనిలోని అంశాలను తమ పార్టీల మేనిఫెస్టోలలో చేర్చాలని పత్రికాముఖంగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. మరో కోకన్వీనర్ అడ్వకేట్ అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం ఉందని దీనిని వినియోగించుకుని ఓటరుగా పేరునమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ అక్బర్ బాషా, సభ్యులు డి.బి.సత్యనారాయణ, శ్రీనివాస్, లుఖ్మాన్, ముషాహిద్ బేగ్ పాల్గొన్నారు.



మేనిఫెస్టో విడుదల చేస్తున్న నాయకులు

నారా లోకేష్‌ను కలిసిన బ్రాహ్మణులు

## బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరినట్లు బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యామిజాల నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం టిడిపి నాయకులు నారా లోకేష్‌ను కలిసి బ్రాహ్మణుల సమస్యలను గురించి వివరించానని తెలిపారు. 2024లో టిడిపి అధికారంలోకి రాగానే బ్రాహ్మణ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారన్నారు. వేద పండితులకు, పురోహితులకు విద్య పూర్తికాగానే మూడు సంవత్సరాల పాటు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆగమ మండలిని ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో టిడి జనార్ధన్, బుచ్చి రాంప్రసాద్, ఆనంద్ సూర్య కూడా పాల్గొన్నారని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.